క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

హుస్నాబాద్: ఆర్టీసీ బస్ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందజేసేందుకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు 9959225930 నంబర్‌కు ఫోన్‌చేసి మీ అమూల్యమైన సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకొని డిపో అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

దుబ్బాకరూరల్: రేషన్ డీలర్ల గౌరవ వేతనం ఇతర డిమాండ్ల సాధనకు ఈనెల 26 బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తాడూరి బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రేషన్ డీలర్ల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు మంద లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని రేషన్ డీలర్లు అధిక సంఖ్యలో ఆయన తరలిరావాలని కోరారు.

ఆంజనేయస్వామికి 14వేల వడలతో అలంకరణ



14వేల వడలతో స్వామివారి అలంకరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రావి చెట్టు హనుమాన్ ఆలయాన్ని, ఆంజనేయ స్వామిని 14వేల వడలతో మంగళవారం అందంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకోడానికి వచ్చిన భక్తులు అలంకరణ చూసి మంత్ర ముగ్దులయ్యారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

హనుమాన్ స్వాములకు భిక్ష ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రసిద్ధ మార్కండేయస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో ఉచితంగా పాలు, పండ్లు, భిక్ష(భోజనం) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. హనుమాన్ జయంతి వరకు మాలధారణ స్వాములకు నిత్యం పాలు, పండ్లు, భిక్ష అందిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ డిస్కంలలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిద్దిపేట విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఈ మేరకు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనాలు అందించాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం



అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడపలో ముడుపుల రేణుక ఎల్లమ్మ కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య అమ్మవారి కల్యాణం నేత్రపర్వంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

అంబలి కేంద్రం ఏర్పాటు

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామంలో సల్కం మల్లేశం సహకారంతో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మల్లేశంను ఆయన అభినందించారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

గజ్వేల్‌రూరల్: నివాస గృహాల మధ్య మురికి కూపాలు లేకుండా చర్యలు తీసుకొని మలేరియాను తరిమికొట్టి ఆరోగ్యవంతులుగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయరాణి పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గజ్వేల్‌లో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, వైద్యులు శివప్రసాద్, తేజస్విని, హెడ్‌నర్స్ రోజ్‌మేరీ, శ్రీలత, రాములు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మతం పేరుతో చౌకబారు రాజకీయాలు

- మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- దేశంలోనే తెలంగాణ పథకాలు నంబర్‌వన్
- హుస్నాబాద్ సభలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

హుస్నాబాద్: ఉనికి కోసం కాంగ్రెస్ ఆరాటం, మతం పేరుతో బీజేపీ చౌకబారు రాజకీయాలు చేస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. పట్టణ శివారులోని పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో మంగళవారం నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. . తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా అబద్ధాలు ఆడుతున్న బీజేపీ జూటా పార్టీ అని, 75 ఏళ్లలో చేయని అభివృద్ధిని 8 ఏళ్లలో కేసీఆర్ చేసి చూపెట్టారని తెలిపారు. ఎన్నో పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌కు ప్రజలు మద్దతు తెలుపాలన్నారు. తెలంగాణ కోసం వంటావార్పులు చేసి, పోరాటాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కోర్టులు, గ్రీన్‌ట్రిబ్యూనల్‌లో కేసులు వేశారన్నారు. భూ నిర్వాసితుల అన్ని డిమాండ్లు నెరవేర్చామన్నారు. హుస్నాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. బలంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీపై అవసరం లేని సమస్యలు సృష్టిస్తున్నారని, నియోజకవర్గంలోనే బీఆర్ఎస్ బలమైన పార్టీగా ఎదిగి ప్రజల మన్ననలు పొందుతుందన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో, సంక్షేమ పథకాల అమలులో నంబర్‌వన్‌గా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని, కరెంట్ తీగలు బట్టలు ఆరేసుకోవడానికి పనికి వస్తాయని ఎద్దేవా చేశాడని అన్నారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. బీజేపీ నాయకులు బట్ట కాల్చి మీద వేస్తూ కేసీఆర్ కుటుంబాన్ని బదనాం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ సీఎం అవడం ఖాయమని, హుస్నాబాద్‌లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలవడం ఖాయమన్నారు.

తెలంగాణపై ముందే రూపకల్పన

ఉద్యమ కాలంలోనే తెలంగాణ ఎలా ఉంటుందో రూపకల్పన చేసిన గొప్ప రాజకీయ చేతురతుడు కేసీఆర్ అని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. కేసీఆర్ ధైర్యవంతుడు కాబట్టే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు కర్ర శ్రీహరి, పన్యాల భూపతిరెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, అనుబంధ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ

- రాష్ట్రంలో బీజేపీ కలలో కూడా అధికారంలోకి రాదు
- దుబ్బాక బీఆర్ఎస్ సభలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాకటౌన్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రాష్ట్రంలో బీజేపీ కలలో కూడా అధికారంలోకి రాలేదని, రానివ్వమని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశాడు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ విజయవంతమైంది. ఈ సభకు దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, మిరుదొడ్డి, చేగుంట మండలాల్లోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

దుబ్బాక గడ్డ బీఆర్ఎస్‌కు అడ్డా..

ప్లీనరీ సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక గడ్డ బీఆర్ఎస్ పార్టీకి అడ్డా అని అన్నారు. మొదటి నుంచే దుబ్బాక ప్రజలు చైతన్యం కలిగినవారన్నారు. సభకు వచ్చిన కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే దేశంలో బీజేపీ పతనం దుబ్బాక నుంచే మొదలైందనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. మల్లన్నసాగర్‌ను నిర్మించి దుబ్బాకలో పాడుబడ్డ భూములను సస్యశ్యామలం చేసిన ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ తమ కుటుంబసభ్యులతో సమానమని వారికి ఏ ఆపద వచ్చిన ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.

తీర్మానాలు ప్రవేశపెట్టిన ప్రజాప్రతినిధులు

ఈ సభలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, వైద్య, మహిళా సంక్షేమం, మిషన్ భగీరథ, మన ఊరు మన బడి వంటి పథకాల తీర్మానాలను ఒక ప్రజాప్రతినిధి ఆమోదించగా మరొకరు బలపరిచారు.

ఉర్రుతలూగించిన సాయిచంద్ ఆటాపాట

సభకు వచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గోదాముల, గిడ్డంగులు శాఖ చైర్మన్ సాయిచంద్ తన ఆటా.. పాట.. మాటలతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సాయి చంద్ పాడిన పాటలకు కార్యకర్తలతో సహా ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా డ్యాన్స్‌లు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, సోలిపేట సతీశ్‌రెడ్డి, రాజమౌళి పంతులు, రాజలక్ష్మణరావు, నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమణీయం రంగనాథుని రథోత్సవం



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్ రంగనాయకస్వామి ఆలయంలో ప్రతిఏటా వైశాఖ మాసం మొదలుకొని శుద్ధ పాడ్యమి పంచమి వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో గోదా రంగనాథులకు విశేష పూజలు, వ్రతం, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భగుడి నుంచి వేద పండితుల మంత్రోచ్చారణలు, డప్పు చప్పుళ్ల మధ్య గోదా రంగనాథుల విగ్రహాలను రథంపై కనుల పండువగా వీర హనుమాన్ ఆలయం వరకు ఊరేగించారు. రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రంలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు.

ఘనంగా శేషసాయి మోక్షమందిర వార్షికోత్సవం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్‌లో గల శ్రీశేషసాయి మోక్షమందిర వార్షికోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడురోజుల పాటు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేదపండితులు చాడ నందబాలశర్మ, ఆలయ ప్రధానార్చకుడు గోపీశర్మల వైదిక నిర్వహణలో దత్త, శిరిడీసాయి మూలమంత్ర హవనములతో పాటు హోమ పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి జరిగిన స్వామివారి పల్లకీసేవలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యం గింజను కొంటాం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మార్కెట్‌యార్డులో నిలిచిన మురికి నీటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 42 కిలోల సంచిలో 1కిలో తాలు పేరుతో కోత విధించైనా కాంటా పెట్టి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. మార్కెట్ యార్డు స్థాపించి దాదాపు 30 సంవత్సరాలు గడుస్తున్నా వర్షం నీరు బయటకు వెళ్లే మార్గమే లేదా అని ప్రశ్నించారు. రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం కుప్పల వద్ద మురుగు నిలిచి దుర్వాసన వస్తుందని, మురుగు నిల్వకుండా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడే సూచనలున్నందున రైతులు ధాన్యం కాంటా పెట్టేవరకు టార్పాలిన్లు కప్పి కాపాడుకోవాలన్నారు. తేమశాతం, తాలు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా మంత్రి హరీశ్‌రావు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ చంద్రమోహన్, డీఎస్ఓ బ్రహ్మారావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిని, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కార్యదర్శి సుజన్‌కుమార్, శంకర్‌రెడ్డి, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి సారించాలి



చిన్నారులకు నివేదిక కార్డులు అందజేస్తున్న స్వరూప, జోత్స్న

నంగునూరు(సిద్దిపేట): చిన్నారులకు పోషకాహారం అందేలా చూడడంతో పాటు శారీరక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. ప్రీస్కూల్ డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం బద్దిపడగ అంగన్‌వాడీ పాఠశాలలో పిల్లల ఎదుగుదలపై నివేదిక కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్యోత్స్న, టీచర్లు లలిత, శ్రీలత, విజయ, రాజేశ్వరి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పోషకాహారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ సునీత, టీచర్లు, ఆయా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమ్మేళనాలతో కోట్లు ఖర్చు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉద్యోగ భద్రత కల్పించాలి

గజ్వేల్‌రూరల్: తమను రెగ్యులరైజ్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ(జేపీ) కార్యదర్శులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గజ్వేల్ డివిజన్ పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ ఫోన్‌లలో ఉన్న పంచాయతీరాజ్(పీఆర్) అప్లికేషన్ యాప్‌ను బహిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమపై దయచూపి రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు అజారుద్దీన్, మహిళా అధ్యక్షురాలు సంధ్యలతో పాటు డివిజన్ పరిధిలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ నియామకం

సిద్దిపేటఅర్బన్: మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన చెన్నోజు రాజు చారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- ఊరూరా బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణ



గజ్వేల్‌రూరల్: దిలాల్‌పూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



చేర్యాల(సిద్దిపేట): 1వ వార్డులో..



దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



హుస్నాబాద్‌లో..

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దిలాల్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సర్పంచ్ దివ్యసుధామ ఆధ్వర్యంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన వారిలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో ఆయన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలున్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని 15వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, అయూబ్, నాయకులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించి నాయకులు, ప్రజాప్రతినిధులు బైక్‌ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ.. దేశ ప్రజలు సీఎం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల కార్యాలయం ఎదుట పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు, 1వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, 4వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మిగతా వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు జెండా ఎగురవేశారు. మండల పరిధిలోని నాగపురి గ్రామంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, కడవేర్గులో మండల అధ్యక్షుడు మల్లేశం జెండాలు ఎగురవేశారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని గ్రామాల్లో పార్టీ అధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కొండపాక నుంచి ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలతో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి బైక్‌పై తరలివెళ్లారు. కుకునూరుపల్లి నుంచి రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవిందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సద్గుణలు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటజోన్: మోడల్ స్కూల్ హాస్టల్ నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు ఓఎస్డీ బాల్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ.. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయ, బాలు, స్వాతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వడగండ్ల వాన



మిరుదొడ్డిలో కురిసిన వడగండ్లు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో, మిరుదొడ్డి, అక్బర్‌పేట మండలాల పరిధిలోని మంగళవారం సాయంత్రం వడగళ్ల వాన దంచికొట్టింది. దీంతో వరిధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. పంటలు కోతకు రావడంతో ధాన్యంనేలరాలి రైతులకు కన్నీటిని మిగిల్చింది.

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్, రామక్కపేట, పోతారం, చీకోడ్, కమ్మర్‌పల్లి, ఆరెపల్లి, హబ్సీపూర్ గ్రామాల్లో రాళ్లవర్షం కురవడంతో వరి పంటలన్నీ దెబ్బతిన్నాయి. మామిడికాయలు రాలిపోయాయి.

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల, గోవర్ధనగిరి, ఘనపురం, వరదరాజుపల్లి గ్రామాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మునిగడపలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రతాప్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): కొత్తదొమ్మాటలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వడగళ్ల వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మునిగడప గ్రామంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సునీతతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. ప్రతి గింజకు నష్టపరిహారం, ప్రతీ రైతును ఆదుకుంటామని భరోసా కల్పించారు. మండలంలోని 1414 ఎకరాల్లో వరి, 29 ఎకరాల్లో మొక్కజొన్న, 159 ఎకరాల్లో కూరగాయల పంటలు, 136 ఎకరాల మామిడి తోటలకు నష్టం జరిగిందని వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ బాల్‌లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, ఆదుకుంటుందని, రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంపూర్, ఆకునూరు, కొత్తదొమ్మాట, ముస్త్యాల గ్రామాలతో పాటు పట్టణ పరిధిలో దెబ్బతిన్న పంటలను ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, మండల వ్యవసాయ అధికారి ఆఫ్రోజ్, ఆయా గ్రామాల ఏఈఓలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని, గ్రామాల వారీగా పంట నష్టపోయిన వారి వివరాలను వెంటనే సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట రైతు బంధు జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ రంజిత్‌కృష్ణమూర్తి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఏఈఓలు, సర్పంచులు, రైతులున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంతో పాటు మర్మాముల, సలాఖపూర్, ధర్మారం ,గాగిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాల్లో నష్టపోయిన వరి పంటలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మద్దూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ భూపతి, ఏవో రామకృష్ణ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా మండల కేంద్రంతో పాటు ధర్మారం, గాగిళ్లాపూర్, లింగాపూర్ గ్రామాల్లో వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

పంటనష్టాన్ని నమోదు చేయించుకోవాలి

సిద్దిపేటరూరల్: గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులు వారి పంట నష్టం వివరాలను ఏఈఓల ద్వారా నమోదు చేయించుకోవాలని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్, పెద్దలింగారెడ్డిపల్లి, ఇంద్రగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, వ్యవసాయాధికారి పరశురాం రెడ్డి, ఏఈఓ సుమిత్ర, సర్పంచ్ తిరుపతి, రైతుబంధు సమితి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్ల, గుండారెడ్డిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులతో చర్చించి పంట నష్ట అంచనాల జాబితాను సకాలంలో ప్రభుత్వానికి అందజేసి రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. అదేవిధంగా తీగలకుంపల్లిలో దెబ్బతిన్న పంటలను బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తి పరిశీలించారు.